సాక్షి
హనుమకొండ
సోమవారం । 10 । జూలై । 2023



రాష్ట్రంలో నాణ్యమైన కరెంట్

తెలంగాణలో 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్ అందిస్తున్నామని రాష్ట్ర ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు తెలిపారు. - 8లో



దేశానికి సేవ చేయాలి

ఎన్‌సీసీ కేడెట్లు దేశ సేవకు కృషి చేయాలని, అందుకోసం వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని ఎన్‌సీసీ బెటాలియన్ కమాండెంట్ హెచ్‌పీ.దూబే తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
30.0°/26.0°

వాతావరణం

ఆకాశం ఉదయం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం, రాత్రి వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సివిల్స్ ఉచిత శిక్షణకు అర్హత పరీక్ష

కేయూ క్యాంపస్: తెలంగాణ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ ఉచిత శిక్షణకు అర్హత పరీక్ష ఆదివారం నిర్వహించారు. హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలో నిర్వహించిన ఈపరీక్షకు 405 మంది హాజరైనట్లు స్టడీ సర్కిల్ సంచాలకులు ఆచార్య ఎర్రగట్టుస్వామి తెలిపారు. పది నెలల ఉచిత శిక్షణకు ఎస్సీలు 10 మంది, ఎస్టీలు 15 మంది, బీసీ అభ్యర్థులు 75 మందిని తెలంగాణ నుంచి ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణను ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ బన్న అయిలయ్య, స్టడీ సర్కిల్ అధికారులు బి.నిర్మల, కె.కృష్ణ, డాక్టర్ నెహాదా పర్వీన్, శ్వేత తదితరులు పరిశీలించారు.

నేడు 'చలో ఇందిరాపార్క్'

విద్యారణ్యపురి: స్పౌజ్ టీచర్ల బదిలీలు చేపట్టాలని కోరుతూ ఈనెల 10న 'చలో ఇందిరాపార్క్' కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్పౌజ్ టీచర్ల ఫోరం హనుమకొండ, వరంగల్ జిల్లాల బాధ్యులు కందగట్ల సురేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పౌజ్ బదిలీల ప్రక్రియ చేపట్టాలని నిర్వహించే ఈధర్నాలో స్పౌజ్ టీచర్లంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. సాంకేతిక సమస్యల సాకుతో 13 జిల్లాల్లో స్పౌజ్ టీచర్ల బదిలీలు పూర్తి చేయడం లేదని పేర్కొన్నారు. దీంతో ఒక జిల్లాలో భార్య, మరో జిల్లాలో భర్త విధులు నిర్వహిస్తూ 18 నెలలుగా ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు.

ఉన్నత విద్యకు రూ.లక్ష ఆర్థిక సాయం



రామన్నపేట: ఐఏఎస్‌కు ప్రిపేరయ్యేందుకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న కాపర్తి ప్రణీత్‌కు ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థికసాయమందించారు. ఈసందర్భంగా వైశ్య ఫెడరేషన్ నాయకులు మాట్లాడుతూ.. వైశ్య సామాజిక వర్గంలో ప్రతి ఒక్కరూ బీటెక్, ఎంటెక్ విద్యనభ్యసిస్తున్నారని, ఐఏఎస్‌కు ప్రిపేరయ్యే వారి సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. రూ.లక్ష చెక్కును జిల్లా అధ్యక్షుడు పుల్లూరి మధు, జాతీయ కార్యవర్గ సభ్యులు గట్టు మహేశ్‌బాబు, వెంకన్న, శైలజ సమక్షంలో ప్రణీత్ తండ్రి కోటిలింగంకు అందించారు. కార్యక్రమంలో ఎలగందుల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ వీసీ, రిజిస్ట్రార్‌కు అభినందనలు



కేయూ క్యాంపస్: కేయూకు న్యాక్ 'ఏ ప్లస్' గ్రేడ్ లభించినందుకు యూనివర్సిటీలోని మాదిగ ఇంటెలెక్చువల్ ఫోరం (ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో ఆదివారం క్యాంపస్‌లోని వీసీ లాడ్జ్ వద్ద వీసీ తాటికొండ రమేశ్‌ను, రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావును అభినందించారు. ఈసందర్భంగా వీసీ రమేశ్‌కు శాలువా కప్పి పూల బొకే అందించి సన్మానించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు తాళ్లపెల్లి మనోహర్, వి.రాంచంద్రం, గాదె సమ్మయ్య, అసోసియేట్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్, కాంట్రాక్ట్ లెక్చరర్లు రవీందర్, సత్యజూల, భిక్షపతి, గజ్జల మల్లేశ్, మోహన్, వివిధ విద్యార్థి సంఘాల బాధ్యులు మంద వీరస్వామి, పి.కొమురయ్య, వంగాల సుధాకర్, ప్రసాద్, వడ్డెపెల్లి మధు, మంద భాస్కర్, కళ్లెపెల్లి ప్రశాంత్ పాల్గొన్నారు.

నేడు గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్

వరంగల్ అర్బన్: వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ అడిషనల్ కమిషనర్ అనిస్ ఉర్ రషీద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బల్దియా కౌన్సిల్ హాల్‌లో రాతపూర్వకంగా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ సెల్ చక్కని వేదిక అని నగర ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేటి నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె

విద్యారణ్యపురి: రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని సోమవారం నుంచి సమ్మె చేయనున్నారు. ఈమేరకు జిల్లాలో ఇప్పటికే సంబంధిత యూనియన్ బాధ్యులు డీఈఓ అబ్దుల్ హైకి సమ్మె నోటీస్ అందించారు. కాగా.. పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని డీఈఓ జిల్లాలోని అన్ని మండలాల ఎంఈఓలు, హెచ్‌ఎంలను ఆదేశించారు.

వ్యాగన్.. వావ్!

కాజీపేటలో ఏర్పాటయ్యే రిపేర్, రైల్వే వ్యాగన్ల తయారీ పరిశ్రమ అతిపెద్దదిగా వర్ణింపు

ఆధునిక టెక్నాలజీతో నిర్మాణం.. అట్టహాసంగా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ

వరంగల్ డెస్క్

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామ శివారులో శనివారం ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేసిన రైల్వే వ్యాగన్‌ల తయారీ పరిశ్రమకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. రైల్వే వ్యాగన్ వర్క్‌షాప్‌గా మంజూరైన దీనిని రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమగా అప్‌గ్రేడ్ చేశారు. గతంలో సమకూరిన సదుపాయాలకు మరికొన్నింటిని జోడించారు. అందుకే దీనిని భారతీయ రైల్వేలో రెండో అతి పెద్ద రైల్వే వ్యాగన్ల తయారీ పరిశ్రమగా దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అభివర్ణించారు. ఇప్పటికే ప్రాజెక్టు మోడల్‌ను ప్రదర్శించారు. రైల్వే బోగి మొదటి షెడ్‌లోకి ప్రవేశించిన తరువాత మరమ్మతులు పూర్తయ్యాక బయటికొస్తుంది. ఇదంతా ఒక క్రమపద్ధతిలో సాగుతుంటుంది. రోబోటిక్ సిస్టమ్, ఆధునిక టెక్నాలజీతో నిర్మాణం కానున్న ఈప్రాజెక్టు ప్రత్యేకతలు.. వ్యాగన్ల వర్క్‌షాప్, తయారీ ఎలా చేస్తారో ఒకసారి పరిశీలిద్దాం.

పీఓహెచ్ నుంచి వ్యాగన్ తయారీ యూనిట్‌గా..

- ఇప్పుడున్న వ్యాగన్ వర్క్ షాప్ నుంచి వ్యాగన్ తయారీ యూనిట్ మార్పునకు సంబంధించి లేఅవుట్‌లో పలు మార్పులు చేశారు.
- స్లోపింగ్ షాప్, షీట్ మెటల్ షాప్ ఒకదానికొకటి ఆనుకుని ఉన్నాయి. స్ట్రిప్పింగ్ షాప్ సరైన జిగ్స్, ఫిక్చర్లను ఉపయోగించడం ద్వారా సైడ్ వాల్స్, ఎండ్ వాల్స్ తయారీకి ఉపయోగించుకోవచ్చు.
- బాడీషాప్, వీల్‌షాప్, పెయింట్ షాప్, స్టోర్ వార్డులో ఎలాంటి మార్పు చేయాల్సిన అవసరం లేదు.
- వర్క్‌షాప్ మెషినరీ, ప్లాంట్‌లో కొత్తగా గ్యాంగ్ డ్రిల్లింగ్ మెషిన్, షీరింగ్ మెషిన్, బెంచ్ ప్రెస్, యూనివర్సల్ అండర్ ఫ్రేమ్ వెల్డింగ్ మానిప్యులేటర్స్, స్ట్రెయిటెనింగ్ మెషిన్, హక్ బోల్టింగ్ మెషిన్ తదితర అదనపు పరికరాలు ఏర్పాటు చేస్తారు.
- బోగీ షాప్‌లోనే అదనంగా మరికొన్ని యంత్రాలు వస్తాయి. వ్యాగన్ల తయారీకి అవసరమైన రా మెటీరియల్ వస్తుంది. ఇందులోనే వెల్డింగ్, బాడీ కటింగ్, చక్రాలను అమర్చుతారు. అంతా చేసి వ్యాగన్‌ను రూపొందిస్తారు. ఏది, ఎలా తయారు చేయాలని ఇంజనీర్లకు చెబుతారు.

ఎక్కడంటే :	ఏర్పాటయ్యేవి :	వ్యయం:	విస్తీర్ణం:	గడువు:	చేపట్టిన సంస్థ:	వ్యాగన్ల తయారీ సామర్థ్యం ఇలా..	
కాజీపేట మండలం అయోధ్యపురంలో	రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్, వ్యాగన్ల తయారీ	రూ. 521 కోట్లు	160.4 ఎకరాలు	24 నెలలు	రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ (ఆర్‌వీఎన్‌ఎల్)	మొదటి సంవత్సరం 1,200	రెండో.. 2,400

ప్రాజెక్టు స్వరూపం ఇలా..



పాండ్ : 2వేల కేఎల్‌డీ (కిలో లీటర్స్ పర్ డే) పాండ్‌ను ఏర్పాటు చేస్తారు. ఈ నీటిని వర్క్‌షాప్, వ్యాగన్ తయారీ పరిశ్రమలో వివిధ అవసరాలకు ఉపయోగిస్తారు.

అడ్మినిస్ట్రేషన్ భవనం : ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులంతా ఇక్కడి నుంచే పరిపాలన సాగిస్తారు. వ్యాగన్ల తయారీ, మరమ్మతు తదితర అంశాలపై మానిటరింగ్ చేస్తారు.

స్క్రాప్‌బిన్స్ : పనికిరాని పరికరాలను ఇందులో వేస్తారు. డ్యామేజీలు, కాలం చెల్లినవి, విరిగిపోయిన వాటన్నింటినీ స్క్రాప్ (చెత్త)కింద వేస్తారు.

స్టోర్‌వార్డ్ : ఇందులో వ్యాగన్ (ప్రయాణికుల బోగీ), బోగీ (గూడ్స్)ల తయారీ, మరమ్మతులు, ఇతర పార్ట్స్‌లను ఇందులోనే భద్రపరుస్తారు. అవసరమైన వాటిని అక్కడి నుంచి తీసుకెళ్తారు.

ట్రావెర్సర్ : ఇది షాప్(షెడ్)లకు అనుబంధంగా అటు, ఇటు తిరిగేలా ఇంజన్ ఉంటుంది. ఇందులో బోగీని లోపలి భాగం నుంచి లోడ్ చేసి వివిధ షాప్‌లకు పంపించే అవకాశం ఉంటుంది. ఇది ట్రాక్ టు ట్రాక్‌కు, లైన్ టు లైన్ అనుసంధానం, షిఫ్ట్ చేసేందుకు దోహదపడుతుంది.

షవర్ టెస్ట్ : ఇందులో వ్యాగన్ బాడీని ఉంచి నీటి ప్రెషర్ చేస్తారు. దీంతో బాడీ శుభ్రం కావడంతోపాటు ఏదైనా లీకేజీ ఉంటే నీళ్లు కారడం గానీ, తడిసిపోవడం ఈజీగా తెలిసిపోతుంది. ఒకవేళ లీకేజీలు ఉంటే వ్యాగన్‌ను తిరిగి రిపేర్ షాప్‌నకు పంపుతారు. ఎలాంటి లీకేజీ లేకపోతే అన్‌మాస్క్ చేసి తిరిగి పెయింట్ షాప్‌నకు పంపుతారు.

మరమ్మతులు చేయాల్సిన బోగీలను తీసుకువచ్చే రైల్ ఇంజిన్‌కు కడిపికొండ క్రాస్‌వద్ద నుంచి రైల్వేలైన్ అయోధ్యపురం వ్యాగన్ వర్క్‌షాప్‌నకు కనెక్టివిటీ ఉంటుంది.



షీట్ మెటల్, మిస్క్‌షాప్: ఇందులో వ్యాగన్‌ను చేర్చాక బాడీ, చక్రాలు, లోయర్‌పార్టులను వేరు చేస్తారు. వాటిని తరువాత ఉండే స్ట్రిప్పింగ్, వీల్ షాప్‌ల విభాగాలకు పంపిస్తారు. ఈ విభాగం 2,070 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది.

పెయింట్ షాప్ : ఇందులో వ్యాగన్‌కుగానీ, బోగీ బాడీకి ప్రైమరీగా ఎర్ర రంగు వేస్తారు. పెయింట్ అంతా రోబోటిక్ సిస్టమ్‌తో వేస్తారు. మాస్కింగ్ చేసి షవర్‌టెస్ట్‌కు పంపుతారు. షవర్‌టెస్ట్‌లో ఓకే అయ్యాక పూర్తి స్థాయిలో రంగులు వేయడంతోపాటు వివిధ రైల్వే అంశాలను చేతితో రాసి వ్యాగన్‌ను సిద్ధం చేస్తారు.

స్ట్రిప్పింగ్ షాప్ : ఇందులో బోగి బాడీని ఉంచి ఎక్కడెక్కడ డ్యామేజ్ అయ్యిందో గుర్తించి దానిని తొలగిస్తారు. రిపేర్ చేయాల్సిన బాడీకి తగినట్లు షీట్లను సైజ్, షేప్ కటింగ్ చేస్తారు. తర్వాత బాడీని బోగీ షాప్‌నకు తీసుకెళ్తారు. ఈ విభాగం 4,800 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది.



రైల్వే వ్యాగన్ పరిశ్రమ నిర్మించే స్థలం ఇదే..

వీల్‌షాప్ : మొదట విడదీసిన చక్రాలు ఈ విభాగానికి పంపిస్తారు. ఇందులో 18 వరకు ప్రత్యేక మిషనరీలు ఉంటాయి. ఒక్కోదానిలో చక్రం పనితీరు, గేజ్, అలైన్‌మెంట్, డయాచెక్, బేరింగ్, డిస్క్, హార్డ్‌నెస్, బ్రేక్‌లు చెక్ చేస్తారు. అంతా ఓకే అయిన తరువాత చక్రాలను తిరిగి బోగీషాప్‌నకు పంపుతారు. ఈ విభాగం 7,800 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉంటుంది.

బోగి షాప్ : ఇందులో బోగీ బాడీని నిలబెడతారు. స్ట్రిప్పింగ్ షాప్‌లో కటింగ్ చేసిన బాడీ విభాగాలను ఇందులో అమరుస్తారు. ఆ తరువాత చక్రాలు వస్తాయి. అంతా కలిపి బోగీని సిద్ధం చేస్తారు. ఈ విభాగం 5,980 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉంటుంది. అనంతరం బాడీ షాప్‌నకు పంపుతారు.

బాడీ షాప్: ఇందులో బోగీలోని ప్యానెళ్లు, ఫ్లోర్‌ప్లేట్లు, పైకప్పు షీట్లు తుప్పు ఉంటే తొలగిస్తారు. వెల్డింగ్ మెటల్ కోల్పోవడంతో వెల్డింగ్ జాయింట్లు బలహీనపడితే సరిచేస్తారు. బాడీని మొత్తం చెక్ చేసి తరువాత విభాగానికి పంపుతారు. ఈ విభాగాన్ని 5,980 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తారు.

సీబీసీ (సెంటర్ బఫర్ కప్లర్) షాప్ : అంతా సిద్ధమైన బోగీలను అన్‌మాస్క్ చేసి ఫైనల్‌గా చెక్ చేస్తారు. వ్యాగన్‌లను ట్రాక్‌పై ఒకదానికొకటి కప్లింగ్ చేస్తారు. చివరగా బోల్టులు, వ్యాగన్లకు అయితే లైట్లు, ఇతరత్రా చిన్న టెక్నికల్ అంశాలను సరిచేస్తారు. మొత్తం 30 వ్యాగన్‌లను జత చేసి ఆ తర్వాత ట్రాక్‌పైకి ప్రవేశపెడతారు.

రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇవ్వకున్నా వ్యాగన్ పరిశ్రమ

ప్రధాని మోదీ సభ గ్రాండ్ సక్సెస్

- సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

హన్మకొండ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం వ్యాగన్ తయారీ పరిశ్రమకు పూర్తిస్థాయి స్థలం ఇవ్వకున్నా.. కేంద్ర ప్రభుత్వం మొదటి దశలో రూ.591 కోట్లు మంజూరు చేసిందని, ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంకా 10 ఎకరాల స్థలం ఇవ్వాల్సి ఉందన్నారు. ఆదివారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రావు పద్మ మాట్లాడుతూ.. కోచ్ ఫ్యాక్టరీ, వ్యాగన్ ఫ్యాక్టరీకి రాష్ట్ర మంత్రి హరీశ్‌రావుకు తేడా తెలుసా? అని ప్రశ్నించారు. ప్రధాని మోదీపై ప్రతిపక్షాల విమర్శలు వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. ప్రధాని మోదీ విజయ సంకల్ప సభ గ్రాండ్ సక్సెస్ అయిందని, సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. డబ్బులతో ఎన్నికల్లో గెలవడమే బీఆర్‌ఎస్ ఎజెండా అని దుయ్యబట్టారు. ప్రధానిపై విమర్శలు చేసే స్థాయి బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌భాస్కర్, అరూరి రమేశ్‌కు లేదన్నారు. హైదరాబాద్, సిద్దిపేట, గజ్వేల్ అభివృద్ధికే బీఆర్‌ఎస్ పరిమితమని, వరంగల్‌ను పట్టించుకోలేదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ మురళీధర్‌గౌడ్, నాయకులు గుజ్జ సత్యనారాయణరావు, దేశిని సదానందం గౌడ్, ఆర్.పి జయంత్‌లాల్, కొండి జితేందర్‌రెడ్డి, గుజ్జుల మహేందర్‌రెడ్డి, పాషికంటి రాజేంద్రప్రసాద్, పానుగోటి వెంకట్‌రావు, పాల్గొన్నారు.

కోచ్ ఫ్యాక్టరీ సాధనకు ఉద్యమిస్తాం



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట: కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ సాధన కోసం ఉద్యమాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు టి.శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం హనుమకొండ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్‌కు వచ్చిన మోదీ విభజన హామీలపై స్పందించలేదన్నారు. వ్యాగన్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్ అని ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. నిజాం కాలం నాటి మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు నిధులు మంజూరు చేసి ప్రారంభించాలన్నారు. సమావేశంలో నాయకులు కె.భిక్షపతి, ఎల్లేశ్, శ్రీనివాస్, శంకర్, ఓదెలు, రాములు, రాజు తదితరులున్నారు.

పెరిగిన ధరలతో ప్రజల బెంబేలు

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి
- ఆపార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన



టమాటలు పంచి నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

హన్మకొండ: రాష్ట్రంలో నిత్యావసర, కూరగాయల ధరలు పెరగడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. పెరిగిన ధరలకు వ్యతిరేకంగా ఆపార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని గోకుల్ కూడలిలో వినూత్న నిరసన తెలిపారు. మహిళలకు టమాటలు ఉచితంగా పంచి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. టమాట, పచ్చిమిర్చి ధరలు రూ.100 దాటాయని, కూరగాయలు, నిత్యావసర ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ యాదవ్ మాట్లాడుతూ.. పెరిగిన ధరలతో దళారులు బాగుపడుతున్నారని, రైతులకు ఏమీ లాభం జరగడం లేదన్నారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ధరలు నియంత్రించాలని, టమాట, మిర్చిపై ప్రభుత్వం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, నాయకులు గుంటి స్వప్న, నాగపురి లలిత, బొమ్మతి విక్రమ్, బంక సతీశ్‌యాదవ్, మహమ్మద్ బాఖీ, మంద రాకేశ్, బొంత సారంగం, వల్లపు రమేశ్, బి.కమల, సుగుణ, బొల్లు లలిత, సి.హెచ్ రాజ్యలక్ష్మి, మౌనిక, లక్ష్మి, స్వరూప, బొంత సుజాత, వల్లపు రజిత, పోశాల జ్యోతి, కె.పద్మ, సాంబలక్ష్మి పాల్గొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని నిలిపేయాలి

- ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు: గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాన్ని నిలిపేయాలని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. హనుమకొండలోని నివాసంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రైతులకు అన్యాయం చేస్తూ.. గ్రీన్ ఫీల్డ్ హైవేకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేయడం సిగ్గుచేటన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవేతో పరకాల నియోజకవర్గ రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటును తామే చేశామని మోదీ పేర్కొనడం అర్థ రహితమన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని చెప్పి పాత బోగీలకు ప్యాచులు వేసే ఫ్యాక్టరీకి శంకుస్థాపన చేశారని విమర్శించారు. గ్రీన్ ఫీల్డ్ హైవేతో అదానీ, అంబానీలకు మాత్రమే లాభమని రైతులకు ఎలాంటి లాభం లేదని, టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు కోసం భూసేకరణకు తాను 2 నెలలు కష్టపడ్డానని గుర్తు చేశారు. రూ.3లక్షలు ఎకరానికి మార్కెట్ రేటు ఉంటే రైతులకు రూ.10లక్షలు ఇచ్చి 100 గజాల స్థలం ఇచ్చామని తెలిపారు. గ్రీన్ ఫీల్డ్ రైతులకు మూడు రెట్లు అదనపు ధర ఇవ్వాలన్నారు. ప్రధాని మోదీకి ఈడీ, సీబీఐ అండగా ఉంటే తమకు తెలంగాణ ప్రజల అండ ఉందన్నారు. మోదీ తెలంగాణకు, వరంగల్‌కు ఏం చేశారో చెప్పకుండా కేసీఆర్‌ను తిట్టడానికి పరిమితమయ్యారన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ, కాంగ్రెస్‌కు ప్రజలు గట్టి బుద్ధి చెబుతారన్నారు.

నేటినుంచి పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలు

హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో కొనసాగుతున్న పఠనోత్సవం

- ప్రతీ తరగతికి లైబ్రరీ పీరియడ్ అమలు
- ఒక్కో లైబ్రరీ కార్నర్‌కు 259 ఆంగ్ల, తెలుగు మాధ్యమాల కథల పుస్తకాలు



పుస్తకాలు చదువుతున్న వరంగల్ మండలం లక్ష్మీపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని 4వ తరగతి విద్యార్థులు

కాశిబుగ్గ సెంటర్/విద్యారణ్యపురి: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించేందుకు పఠనోత్సవం (రీడింగ్ క్యాంపెయిన్) జూన్ 26 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న విషయం తెలిసిందే. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రతీ విద్యార్థి ధారాళంగా చదవడం, రాయడంతోపాటు వారిలో పఠనాసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ముందుకు సాగుతోంది. అదేవిధంగా చదవడం ఒక అలవాటుగా మారడానికి, స్వతంత్ర పాఠకులుగా ఎదగడానికి విద్యార్థులకు దోహదపడుతుంది. ఇప్పటికే వరంగల్ జిల్లాలో ఎంపిక చేసిన 144 లైబ్రరీ కార్నర్‌లకు సమగ్ర శిక్ష, ఎస్‌సీఈఆర్‌టీ, రూం టూ రీడ్ సహకారంతో ఒక్కో లైబ్రరీ కార్నర్‌కు 259 ఆంగ్ల, తెలుగు మాధ్యమాల కథల పుస్తకాలను అందజేశారు. హనుమకొండ జిల్లాలో విద్యార్థుల స్థాయిని బట్టి గ్రీన్, రెడ్, ఆరెంజ్, వైట్, బ్లూ, ఎల్లోగా వర్గీకరిస్తూ పాఠశాలలకు చేరవేశారు. ఇచ్చిన పుస్తకాల సక్రమ వినియోగం కోసం తరగతికి ఒక లైబ్రరీ పీరియడ్‌ను ఉపాధ్యాయులు తప్పనిసరిగా అమలు చేస్తున్నారు. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలు సరఫరా చేశారు. వరంగల్ జిల్లాలో ఎంపిక చేసిన 80 ఉన్నత పాఠశాలలకు 120 పుస్తకాల చొప్పున, 20 ప్రాథమికోన్నత పాఠశాలలకు 74 పుస్తకాల చొప్పున పంపిణీ చేశారు. హనుమకొండ జిల్లాలో 492 పాఠశాలలు ఉండగా.. 153 ప్రైమరీ స్కూళ్లలో గ్రంథాలయాలు ఏర్పాటు చేయగా, వారికి ర్యాక్‌లు, పుస్తకాలు ఇచ్చారు. 18 యూపీఎస్‌లకు, 72 హైస్కూళ్లకు అదనంగా పుస్తకాలు ఇచ్చారు. ఈకార్యక్రమాన్ని మరింత పటిష్టం చేయడానికి, విస్తృత పరచడానికి ఈనెల 10నుంచి 15వ తేదీ వరకు పాఠశాలల్లో గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించాలి

గ్రంథాలయ వారోత్సవాలను పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలి. పఠనోత్సవం, గ్రంథాలయ వారోత్సవాలను సూచిస్తూ ఫ్లెక్సీ లేదా బ్యానర్ ఏర్పాటు చేయాలి. గ్రంథాలయ వారోత్సవాలు, పఠనం, గ్రంథాలయాల ఉపయోగాలను విద్యార్థుల తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. పుస్తకాల సక్రమ వినియోగం కోసం తరగతికి ఒక లైబ్రరీ పీరియడ్‌ను ఉపాధ్యాయులు తప్పనిసరిగా అమలు చేయాలి.

– అబ్దుల్‌హై, డి.వాసంతి, హనుమకొండ, వరంగల్ డీఈఓలు

గ్రంథాలయ వారోత్సవాల నిర్వహణ ఇలా..

ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు

10వ తేదీన..

- పఠనోత్సవం, గ్రంథాలయ వారోత్సవాలను సూచిస్తూ ఫ్లెక్సీ లేదా బ్యానర్ ఏర్పాటు చేసి గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమైనట్లుగా ఉపాధ్యాయులు ప్రకటించాలి.
- ఈ కార్యక్రమానికి పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, ప్రతినిధులు, దాతలు, ప్రముఖులను ఆహ్వానించాలి.

11వ తేదీన..

- పుస్తక పఠనం ఆవశ్యకతను తెలియజేస్తూ విద్యార్థుల ఇళ్లకు ర్యాలీగా వెళ్లి వివరించాలి.
- పుట్టిన రోజులాంటి వివిధ సందర్భాల్లో పిల్లలకు బహుమతిగా పుస్తకాలను అందజేయడంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలి.

12, 13వ తేదీల్లో..

- పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు సేకరించే కార్యక్రమం చేపట్టాలి.
- దాతల నుంచి, పాఠశాల ఉపాధ్యాయుల నుంచి కథల పుస్తకాలు, వార్తా పత్రికల్లోని పిల్లల పేజీల్లో ఉండే కథలు, బొమ్మలు, పజిల్స్ వంటి వాటిని సేకరించి, వాటన్నింటినీ పిల్లలకు అందుబాటులో ఉంచేటట్లు చూడాలి.

14వ తేదీన..

- విద్యార్థులతో చేయించిన పేపర్ కట్టింగ్స్ లేదా కార్టూన్స్, పజిల్స్ మొదలైన రీడింగ్ కార్డ్స్‌ను ఒక్కో పాఠశాలకు వంద చొప్పున స్వయం అభ్యసన సామగ్రి తయారు చేయించి అందుబాటులో ఉంచాలి.

15వ తేదీన..

- ఈ రోజు మూడవ శనివారం సందర్భంగా తల్లిదండ్రుల సమావేశం నిర్వహించి పిల్లలతో పుస్తక పఠనం చేయించాలి.
- పిల్లలకు పఠన పోటీలు నిర్వహించాలి.
- పఠన పోటీల్లో భాగంగా కథలు చదివించడం, పుస్తక సమీక్ష, సొంతంగా కథలు చెప్పడం వంటి అంశాల్లో పోటీలు నిర్వహించాలి.
- వేగంగా తప్పులు లేకుండా చదవగలగడం అనే అంశంలో పోటీలు, రివర్స్ రీడింగ్ కూడా చేయించడం ద్వారా అక్షరాలు, పదాలపై విద్యార్థులు పట్టు సాధించేటట్లు చేయాలి.
- పై కార్యక్రమాలపై హెచ్‌ఎంలు సమగ్ర నివేదిక రూపొందించి జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి చేరవేయాలి.

పాఠశాల విద్యార్థులకు పోస్టర్ మేకింగ్ పోటీలు

విద్యారణ్యపురి : ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా (జూలై 11) హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో , కేజీబీవీల్లో, టీఎస్ఆర్ఐఈఎస్ పాఠశాలల్లో 6 నుంచి 10వతరగతి విద్యార్థులకు ఈనెల 12న జిల్లాస్థాయిలో పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు డీఈవో ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. తొలుత ఈనెల 11న పాఠశాల స్థాయిలో 'సేఫ్‌యూజ్ ఆఫ్ ఇంటర్నెట్ అండ్ గాడ్జెట్స్', ప్రొటెక్షన్ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశాలల్లో ఏదేని ఒక అంశంపై పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాల నుంచి ప్రథమ స్థానం వచ్చిన విద్యార్థులు జిల్లా స్థాయిలో ఈనెల 12న ఉదయం 9-30గంటలకు హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో పోస్టర్‌మేకింగ్ పోటీల్లో పాల్గొనాలన్నారు. ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి రూ 500, ద్వితీయ స్థానం రూ. 400, తృతీయ స్థానం సాధించిన విద్యార్థికి రూ.300 అందజేస్తారు. సందేహాలకు 9849834110 నంబర్‌లో సంప్రదించాలని జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ ఎ శ్రీనివాస్ తెలిపారు.

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల రీషెడ్యూల్

కేయూ క్యాంపస్: వాయిదా పడిన కేయూ పరిధి డిగ్రీ రెండో, నాలుగో, ఆరో సెమిస్టర్ పరీక్షల్ని పరీక్షల విభాగం అధికారులు రీ షెడ్యూల్ చేశారు. వాయిదా పడిన పరీక్షలను పరీక్షల విభాగం అధికారులు ప్రకటించారు. డిగ్రీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 11, 13, 15 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జరగనున్నాయి. నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 12, 14, 18వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయి. ఆరో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 11, 13, 15, 19, 20, 21, 22, 24, 25వ తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరగుతాయని పరీక్షల విభాగం అధికారులు తెలిపారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడి మృతి


జయరాం(ఫైల్)

కేసముద్రం: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన ఆదివారం ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామ శివారు కోక్యాతండాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తండాకు చెందిన ఇస్లావత్ జయరాం(65), కమిలి దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కొంత కాలంగా కుటుంబంలో ఆస్తి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో అప్పటికే అనారోగ్యంతో జయరాం బాధపడుతున్నాడు. ఈక్రమంలో ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరుకోగా, అతడిని తండావాసులు మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న అతడి పరిస్థితి విషమించి మృతి చెందాడు. కాగా, జయరాం మృతి పట్ల పలువురు తండావాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రోడ్డుపై పార్క్ చేసిన ఖాళీ డీసీఎంలు



దారిచూపరూ..!

వరంగల్ లక్ష్మీపురం మోడల్ కూరగాయల మార్కెట్.. రోజూ వేలాదిమంది కొనుగోలుదారులు.. వందలాది మంది అమ్మకందారులతో కిటకిటలాడే ప్రాంతం. ఉదయం నుంచి.. సాయంత్రం వరకు జనాలతో రద్దీగా ఉండే చోటు. ప్రతిదినం రూ. కోట్లలో క్రయవిక్రయాలు జరిగే స్థలం. ఇక్కడికి ఉమ్మడి వరంగల్ జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా వస్తుంటారు. ఇంతటి ఘనత కలిగిన మార్కెట్‌ను దారి సమస్య వేధిస్తోంది. కొందరు టమాటా వ్యాపారుల చర్యలతో నడవడానికి దారిలేక.. తమ వాహనాలను పార్క్ చేయడానికి స్థలం లేక కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిని మార్కెట్ అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

–వరంగల్

మార్కెట్‌లో నడిచేదెలా?

- రోడ్డుపై ఇష్టానుసారంగా డీసీఎం, ఇతర వాహనాలు
- కాలినడక దారిలోనే తడకలతో నిర్మాణాలు
- వినియోగదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని మార్కెట్ అధికారులు

రోడ్డును ఆక్రమించి.. తడకల ఏర్పాటు

మార్కెట్ పక్కన ఉన్న టవర్ ప్రాంతం చుట్టూ ఉన్న రహదారిపై టమాటా సరుకు తీసుకువచ్చిన ఖాళీ డీసీఎంలను ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తున్నారు. ఫలితంగా కొనుగోలుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా హోల్‌సేల్ టమాటా వ్యాపారులు ఖాళీ బాక్స్‌లను స్టాక్ పెట్టేందుకు ఇదే రహదారికి ఇరుపక్కల స్థలాలు ఆక్రమించుకుని వాటి చుట్టూ తడకలు ఏర్పాటు చేశారు. మోడల్ మార్కెట్ ప్రహరీ, టవర్ మధ్య సుమారు 40 ఫీట్ల వెడల్పుగా రోడ్డుతో సహా ఖాళీ స్థలం ఉంది. ఇందులో ఇరుపక్కల 10–12ఫీట్ల వెడల్పుతో తడకలతో స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేసుకోవడం, వాటిని అను కుని డీసీఎం వాహనాలు పార్కింగ్ చేయడంతో నడిచేందుకు కూడా దారి లేదు. దీంతో కొనుగోలుదారులు టవర్ వద్ద ఖాళీ స్థలంలో తమ వాహనాలు నిలపాలంటే బాక్స్‌ల స్టాక్ పాయింట్‌లు, వాటి పక్కనే డీసీఎం, బొలెరో వాహనాల పార్కింగ్ అడ్డుగా ఉంది. అడ్డుగా ఉన్న డీసీఎంలు, బొలెరో వాహనాలను తీయమని అడిగితే ఎదురుదాడికి దిగుతున్నారు.

పార్కింగ్ ఏర్పాటు చేయాలి



మోడల్ మార్కెట్‌లో అధికారులు పార్కింగ్ ఏర్పాటు చేయాలి. పార్కింగ్ లేకపోవడంతో మార్కెట్‌కు రావాలనిపించడం లేదు. ఖాళీ స్థలంలో వాహనం పార్క్ చేద్దామంటే హమాలీలు లొల్లి పెడుతున్నారు. వెంటనే అధికారులు పార్కింగ్ ఏర్పాటు చేయాలి.

-ఇప్పకాయల శ్రీనివాస్, పోచమ్మమైదాన్

అడ్డుకుంటున్న హమాలీలు

కూరగాయల మార్కెట్ ఎదుట కనిపించిన ఖాళీ స్థలంలో వాహనం పార్కింగ్ చేసేందుకు వెళ్తే అక్కడే ఉంటున్న హమాలీలు అడ్డుకుంటున్నారు. దీనిపై ప్రశ్నిస్తే టమాటా లోడ్ బండి వస్తుంది...అందుకే చెబుతున్నామంటూ కొనుగోలుదారులను అడ్డుకుంటున్నారు. మార్కెట్ ఆర్చి నుంచి టవర్ వరకు ఉన్న రహదారికి ఇరుపక్కల బాక్స్‌ల కోసం తడకల షెడ్లు, పక్కనే డీసీఎం, బొలెరోలను నిలపడంతో నడిచేందుకు స్థలం లేకుండాపోయింది.

దీనిని మార్కెట్ అధికారులు పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

క్రమబద్ధీకరిస్తే మేలు...

- మార్కెట్‌కు నిత్యం వస్తున్న టమాటా సరుకును దింపగానే వాహనాలను బయటకు పంపి అమ్మకాలు పూర్తయ్యాక మళ్లీ వచ్చి లోడ్ చేసుకుంటే రహదారి ఖాళీ ఉండి వినియోగదారులకు ఇబ్బందులు ఉండవు.
- ఆర్చి నుంచి టవర్ వరకు ఖాళీ బాక్సుల కోసం ఏర్పాటు చేసిన తడకల అడ్డాలను తొలగిస్తే రోడ్డు వెడల్పుగా ఉండే అవకాశం ఉంది. మార్కెట్ ఫీజులు చెల్లించకున్నా.. అడ్డాలను అక్రమించుకున్నా పట్టింపులేదు.
- ఈ రోడ్డుపై అనుమతి లేకుండా చిల్లర వ్యాపారం చేస్తున్నా.. మార్కెట్ అధికారులు పట్టించుకోవడం లేదు. వారిని ఒక క్రమపద్ధతిలో కూర్చొబెడితే ప్రయోజనం ఉంటుంది.

అభివృద్ధి పథంలో హైదరాబాద్..

- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి


ఎన్‌ఆర్‌ఐలతో మంత్రి దయాకర్‌రావు

దేవరుప్పుల : తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా సీఎం కేసీఆర్ హైదరాబాద్‌ను అమెరికా తరహాలో అభివృద్ధి చేస్తున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. అమెరికాలో కొనసాగుతున్న 'తానా' మీట్ అండ్ గ్రీట్‌లో ఎన్‌ఆర్‌ఐలతో చర్చాగోష్టిలో మంత్రి మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల ఆత్మగౌరవాన్ని పరిరక్షించిన చరిత్రలో నాడు సీఎం ఎన్‌టీఆర్..నేడు సీఎం కేసీఆర్ ఉన్నారన్నారు. వీరి హయాంలో దారిద్ర్య రేఖ దిగువనున్న ప్రజల కోసం చేపట్టిన ప్రజారంజక సంక్షేమ పథకాలను వివరించారు. గతంలో తన కొడుకు, కూతురు ఊరికి రమ్మంటే వచ్చేవాళ్లు కాదని, తెలంగాణ వచ్చాక పల్లెప్రగతి, తాగు, సాగు నీటి పథకాల వల్ల పచ్చదనంతో ఉట్టిపడుతున్న పల్లెలకు వస్తున్నారని, ఈ మార్పును కొనియాడారు. 24 గంటల కరెంట్, సాగు నీరు అందించడంతో బీడుభూములు సాగులోకి వచ్చి దిగుబడులు పెరిగి మన ప్రాంతంలో వ్యవసాయ భూముల ధరలకు రెక్కలొచ్చాయని పేర్కొన్నారు. విదేశాలలో ఉన్న తెలంగాణ ప్రాంత వాసులు మరోసారి కేసీఆర్‌ను సీఎం చేసేలా సంపూర్ణ తోడ్పాటు అందించాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో నాణ్యమైన కరెంట్

- సీఎండీ దేవులపల్లి ప్రభాకర్ రావు


సీఎండీ దంపతులను సన్మానిస్తున్న ఆలయ అర్చకులు, సిబ్బంది

బచ్చన్నపేట : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 24 గంటలు నాణ్యమైన కరెంట్‌ను అందిస్తున్నామని రాష్ట్ర ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్ రావు అన్నారు. ఆదివారం మండలంలోని కొడవటూర్ గ్రామంలోని స్వయంభూ సిద్ధేశ్వరాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ దేవాదుల చొక్కారావు ఎత్తిపోతల పథకం, ఎస్సారెస్పీ కాలువల ద్వారా సాగు నీరు అందించడానికి ఎన్ని కష్టాలు వచ్చినా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 13168 మెగావాట్ల కరెంట్‌ను ఉత్పత్తి చేసి అందించేవారని, తెలంగాణ ఏర్పడిన తరువాత ప్రస్తుతం 15498 మెగావాట్లు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సాగునీటిని అందించడమే లక్ష్యమన్నారు. సాగు నీటి రవాణాతో అన్ని మెట్ట భూములు సస్యశ్యామలం అవుతున్నాయని, అన్నదాతలు కడుపు నిండా అన్నం తిని కంటి నిండా నిద్ర పోతున్నారన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఎస్సీ వేణుమాధవ్, ఏడీఈ వేణుగోపాల్, ఏఈ రాజ్‌కుమార్, నర్సింహారెడ్డి, ఆలయ కార్యనిర్వాహణాధికారి చిందం వంశీ, సర్పంచ్ గంగం సతీశ్‌రెడ్డి, కోనేటి స్వామి, ఆలయ ప్రధాన అర్చకులు ఓం నమఃశివాయ, సదాశివుడు, నాయకులు మూసిని రాజు, ఆలయ సిబ్బంది చల్లా రాజేందర్‌రెడ్డి, మధు, లక్ష్మీకాంత్‌రెడ్డి, గంగం భాను ప్రకాశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీసీల డిమాండ్ల సాధనకు 'చలో ఢిల్లీ'


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వెంకన్న, ఇతర బాధ్యులు

- సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్న

కేయూ క్యాంపస్ : జనాభా దామాషా ప్రకారం చట్టసభల్లో బీసీ కులస్తులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని దేశవ్యాప్తంగా జరిగే జనగణనలో బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్న అన్నారు. ఈమేరకు ఆదివారం కేయూలో 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్లతో ఈనెల 27, 28 తేదీల్లో 'చలో ఢిల్లీ'ని చేపట్టామన్నారు. జంతర్‌మంతర్ వద్ద నిర్వహించే ధర్నాలో బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. బీసీలకు అన్ని రంగాల్లో అన్యాయమే జరుగుతుందన్నారు. దేశంలో 542 మంది పార్లమెంట్ సభ్యులు ఉంటే అందులో 270 మంది బీసీలు ఉండాల్సిండగా కేవలం 80 మంది మాత్రమే ఉన్నారన్నారు. తెలంగాణ అసెంబ్లీలో 119 మంది ఎమ్మెల్యేల్లో జనాభాదామాషా ప్రకారం 60 మంది బీసీ ఎమ్మెల్యేలు ఉండాల్సిన చోట కేవలం 27 మంది మాత్రమే ఉన్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం బాధ్యులు కందికొండ గంగరాజుప్రజాపతి, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గాదగోని మహేశ్‌గౌడ్, బాధ్యులు బిర్ర అభిషేక్, యాకూబ్, అభినవ్, సైదులు, నరేందర్, భరత్, శ్రీశైలం యాదవ్, శ్రీకాంత్ యాదవ్, పరశురామ్, నాగార్జున, సుమంత్, నవీన్, మహేశ్, భాస్కర్, కమల్, విజయ్‌చారి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్లు దేశానికి సేవ చేయాలి

- ఎన్‌సీసీ గ్రూప్ కమాండెంట్, కల్నల్ హెచ్‌వీ దూబే


ఎన్‌సీసీ శిక్షణ ముగింపు సమావేశంలో గ్రూప్ కమాండెంట్ హెచ్‌వీ దూబే

మామునూరు: ఎన్‌సీసీ కేడెట్లు దేశ సేవకు కృషి చేయాలని, ఇందుకోసం వారికి ప్రత్యేకంగా ఎయిర్ క్రాఫ్ట్ ఫ్లైయింగ్ శిక్షణ ఇచ్చామని ఎన్‌సీసీ బెటాలియన్ కమాండెంట్, కల్నల్ హెచ్‌వీ దూబే తెలిపారు. ఖిలావరంగల్ మండలం మామునూరు పోలీస్ శిక్షణ కళాశాలలో ఎన్‌సీసీ వరంగల్ బెటాలియన్ ఆధ్వర్యంలో 9 రోజులు జరుగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్‌సీసీ శిక్షణలో ఇచ్చే బీ,సీ, సర్టిఫికెట్లు భవిష్యత్‌లో ఉద్యోగం, పదోన్నతులు, ఉపాధికోసం ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఎన్‌సీసీలో శిక్షణ పొందిన యువతను అత్యవసర సమయంలో దేశ సేవకు ఉపయోగించుకుంటామని తెలిపారు. ఎక్కడైనా ప్రమాదాలు సంభవించినప్పుడు కూడా వారి సేవలను వినియోగించుకుంటామని వివరించారు. కార్యక్రమంలో కమాండెంట్ డీ ఎస్ రవత్, కేఆర్ రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏడు మోటార్లతో ఎత్తిపోతలు


లక్ష్మీపంపుహౌస్‌లో ఏడు మోటార్లతో ఎత్తిపోస్తున్న జలాలు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి లక్ష్మీపంపుహౌస్‌లో ఏడు మోటార్లతో ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఇంజనీరింగ్ అధికారులు ఆదివారం లక్ష్మీపంపుహౌస్‌లోని 11 మోటార్లలోని 7మోటార్ల ద్వారా ఎత్తిపోతలు చేపట్టారు. దీంతో ఇప్పటివరకు గ్రావిటికాల్వ మీదుగా అన్నారంలోని సరస్వతి బ్యారేజీకి 4.250 టీఎంసీల నీటిని తరలించినట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. అటు మహారాష్ట్ర నుంచి తరలి వస్తున్న ప్రాణహిత నదిద్వారా ఇన్‌ఫ్లో 27,160 క్యూసెక్కులు తరలి మేడిగడ్డలోని లక్ష్మీబ్యారేజీకి చేరుతోంది. బ్యారేజీలోని మొత్తం 85గేట్లు మూసి ఉంచుతున్నారు. లక్ష్మీబ్యారేజీలో 16.17 టీఎంసీలకు గాను ప్రస్తుతం 11.146 టీఎంసీలు నిల్వ ఉంది. అన్నారంలోని సరస్వతి బ్యారేజీలో మొత్తం 66గేట్లు మూసి ఉంచారు. బ్యారేజీ నీటి సామర్థ్యం 10.87టీఎంసీలకు గాను ప్రస్తుతం 7.850టీఎంసీలు నిల్వ ఉంది. గోదావరి, మానేరు నదుల ద్వారా 3వేల క్యూసెక్కులు తరలివస్తున్నాయి. రాత్రి వేళల్లో నీటి లభ్యతనుబట్టి మూడు మోటార్లను నడిపిస్తున్నట్లు ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

మడికొండ: అప్పుల బాధ భరించలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడు.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మడికొండలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ధర్మసాగర్ మండలం సోమదేవరపల్లికి చెందిన పసుల రాజు(25) బతుకుదెరువు నిమిత్తం 20 సంవత్సరాల క్రితం మడికొండకు వచ్చారు. కుటుంబ అవసరాల నిమిత్తం అప్పులు చేసి వాటిని తీర్చే దారి లేక శనివారం పురుగుల మందు తాగాడు. అనంతరం తనతండ్రి భిక్షపతికి ఫోన్ చేయగా ఆయన వెళ్లాడు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న రాజును చికిత్స నిమిత్తం ఎంజీఎం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. దీనిపై మృతుడి తండ్రి భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దివ్య తెలిపారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి లోకల్ కోర్టులు నిర్వహిస్తున్నట్లు సీజీఆర్‌ఎఫ్ వరంగల్ చైర్మన్ ఎన్‌వీ వేణుగోపాలచారి తెలిపారు. విద్యుత్ వినియోగదారులు లోకల్ కోర్టులో ఫిర్యాదులు అందించి తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 11న మహబూబాబాద్ జిల్లా గూడూరు సబ్ డివిజన్ కొత్తగూడ రైతు వేదికలో లోకల్ కోర్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయోధ్యపురం, గూడూరు. కొత్తగూడ సెక్షన్ ప్రాంతాల వినియోగదారులు ఈ లోకల్ కోర్టు ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. 12న ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ డివిజన్‌లోని నేలకొండపల్లి సెక్షన్ కార్యాలయంలో నిర్వహించే లోకల్ కోర్టులో కూసుమంచి, నేలకొండపల్లి, పాలేరు, రాజేశ్వరపురం సెక్షన్ కార్యాలయం ప్రాంత వినియోగదారులు, 14న కరీంనగర్ జిల్లా జమ్మికుంట సబ్ డివిజన్‌లోని జమ్మికుంట సబ్ స్టేషన్‌లో నిర్వహించనున్న లోకల్ కోర్టులో చల్లూరు, జమ్మికుంట రూరల్, ఇల్లంతకుంట, జమ్మికుంట టౌన్, తనుగుల, వీణవంక సెక్షన్ కార్యాలయం పరిధిలోని వినియోగదారులు ఫిర్యాదులు అందించి పరిష్కరించుకోవాలన్నారు. 15న వరంగల్ జిల్లా పర్వతగిరి సబ్ డివిజన్ ఏనుగల్లు సెక్షన్ కార్యాలయంలో లోకల్ కోర్టు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏనుగల్లు, పర్వతగిరి సెక్షన్ కార్యాలయం పరిధిలోని వినియోగదారులు ఈ కోర్టు ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ నెల 19న పెద్దపల్లి జిల్లా మంథని సబ్‌డివిజన్‌లోని ముత్తారం సబ్‌స్టేషన్‌లో నిర్వహించనున్న లోకల్ కోర్టు ద్వారా బేగంపేట, ఎక్లాస్‌పూర్, కమాన్‌పూర్, మంథని టౌన్, ముత్తారం సెక్షన్ కార్యాలయం పరిధిలోని వినియోగదారులు ఈ కోర్టు ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. ఈ లోకల్ కోర్టులు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఆ కుటుంబాన్ని వెంటాడుతున్న మృత్యువు..

- రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి..
- కుమారుడికి తీవ్ర గాయాలు
- అంతకుముందు తండ్రి మృతి
- లెంకాలపల్లిలో విషాదఛాయలు


భారతి(ఫైల్)

నల్లబెల్లి: మృత్యువు ఆ కుటుంబాన్ని వెంటాడుతోంది. గత నెల 14న తండ్రి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందగా.. తల్లి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆదివారం మృతి చెందింది. కుమారుడికి తీవ్ర గాయాలుకాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. 25 రోజుల వ్యవధిలో తల్లిదండ్రులు మృత్యుఒడికి చేరడం గ్రామస్తులను కలిచివేసింది. ఈ ఘటన ఆదివారం మండలంలోని లెంకాలపల్లి గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన హెడ్‌కానిస్టేబుల్ బొమ్మకంటి సదానందం(55) గత నెల 14న అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆ బాధ నుంచి కుటుంబ సభ్యులు ఇంకా తేరుకోకముందే.. భారతి(48) తన కుమారుడు రాకేశ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై నర్సంపేటకు వెళ్తున్నారు. ఈక్రమంలో బజ్జుతండా శివారులో ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఈ ప్రమాదంలో తల్లి, కుమారుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు ఇద్దరిని అంబులెన్స్‌లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా భారతి చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా, నెల రోజుల వ్యవధిలో తల్లిదండ్రులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలి కూతురు స్నేహ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నైనాల నగేశ్ తెలిపారు.

అతివేగం.. అనర్థం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సాయిరాం(ఫైల్)

భుపాలపల్లి రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధి శాంతనగర్‌లో జరిగింది. మున్సిపాలిటీ పరిధి బానోతువీధికి చెందిన రాథోడ్ సాయిరాం(26) పని నిమిత్తం బైక్‌పై జంగేడుకు వెళ్లాడు. తిరిగి శాంతినగర్ మీదుగా తన ఇంటికి అతివేగంగా వెళ్తున్నాడు. ఈ క్రమంలో శాంతినగర్ సమీపంలో డివైడర్‌ను ఢీకొన్నాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు ఘటనా స్థలి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి బాపూరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

- జనగామలో విషాదం


చాంద్ ఖురేషీ (ఫైల్)

జనగామ : ఏపీలోని నెల్లూరు జిల్లా మహిపాడ్ సముద్రంలో(బంగాళాఖాతం) కొట్టుకుపోయిన జనగామకు చెందిన యువకుడి మృతదేహం ఆదివారం లభ్యమైంది. పట్టణంలోని లక్ష్మీబాయ్ కుంటకు చెందిన వ్యాపారి ఎండీ జలాల్, ముంతాజ్ 3వ కుమారుడు చాంద్‌ఖురేషీ ఈ నెల 6వ తేదీన నెల్లూరు దర్గాలో జరిగే రొట్టెల పండగకు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి వెళ్లాడు. దర్గాను దర్శించుకున్న తర్వాత 7వ తేదీన సముద్ర తీరానికి వెళ్లాడు. స్నానం చేసే సమయంలో రివర్స్‌లో వచ్చిన అలలతో చాంద్‌ఖురేషీ కొట్టుకు పోయాడు. అక్కడే ఉన్న కుటుంబ సభ్యులు, సందర్శకులు కేకలు వేయడంతో జాలర్లు, గత ఈతగాళ్లు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న తండ్రి జలాల్, స్నేహితుడు సలీం హుటాహుటినా నెల్లూరు బయలుదేరి వెళ్లారు. రెండో రోజు ఎన్‌డీఆర్‌ఎఫ్ బలగాలు సైతం రంగంలోకి దిగగా, వాతావరణ పరిస్థితులు అనకూలించకపోవడంతో చాంద్‌ఖురేషీని వెతికే సమయంలో అనేక కష్టాలు ఎదురయ్యాయి. మూడు రోజుల తర్వాత ఆదివారం ఉదయం సముద్రం అవతలి భాగం, గంగపట్నం ఏరియా ఒడ్డున గుర్తుతెలియని మృతదేహం ఉందనే పోలీసుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు అక్కడకు వెళ్లారు. తండ్రి జలాల్ అక్కడకు వెళ్లి విగతజీవిగా ఉన్న కొడుకును చూసి కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి పోస్టుమార్టం అనంతరం కుటుంబీలకు అప్పగించారు. చాంద్‌ఖురేషీ మృతదేహం అర్ధరాత్రి జనగామకు చేరుకుంది. ప్రాణాలతో వస్తాడని ఎదురుచూస్తున్న కుటుంబ సభ్యులు, స్నేహితులకు విషాదకర వార్త రావడంతో దుఃఖసాగరంలో మునిగిపోయారు.

వరకట్న వేధింపులు తట్టుకోలేక..

- ఆత్మహత్యకు యత్నించిన మహిళ
- చికిత్స పొందుతూ మృతి

హసన్‌పర్తి: వారు పెద్దలను ఎదురించి కులాంతర వివాహం చేసుకున్నారు. రెండేళ్లపాటు వారి కాపురం సవ్యంగానే సాగింది. ఆ తర్వాత వరకట్నం కోసం భర్త వేధింపులకు గురి చేయడంతో భార్య ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. ఆస్పత్రిలో రెండు రోజుల నుంచి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం భీమారానికి చెందిన బండారి సౌజన్య(25), చింతగట్టు క్యాంప్‌నకు చెందిన కె. శ్రీనివాస్ మూడేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు.వారి కాపురం రెండేళ్లు సవ్యంగానే సాగింది. ఏడాది క్రితం నుంచి శ్రీనివాస్ వరకట్నం కోసం సౌజన్యను వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. ఈ విషయాన్ని సౌజన్య తన నాన్నమ్మ బండారి పద్మకు వెల్లడించింది. భర్త వేధింపులు భరించలేక సౌజన్య భీమారంలోని తన నాన్నమ్మ వద్దే కొంతకాలం ఉంది. ఆ తర్వాత శ్రీనివాస్.. తన భార్యను తీసుకెళ్లాడు. కొంతకాలం తర్వాత మళ్లీ దంపతుల మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. దీంతో సౌజన్య మళ్లీ తన నాన్నమ్మ బండారి పద్మ వద్దకు వచ్చింది. దీంతో ఆగ్రహానికి గురైన శ్రీనివాస్.. భీమారానికి వచ్చిన ఆమెను బలవంతంగా తీసుకెళ్లాడు. ఈ క్రమంలో వేధింపులు భరించలేక సౌజన్య ఈనెల 7న ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం ఎంజీఎం తరలించారు. మృతురాలి నాన్నమ్మ బండారి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. కాగా, తమ మాట వినకుండ వివాహం చేసుకోవడంతో తల్లి సంధ్య, సోదరుడు జగదీశ్.. సౌజన్యతో సంబంధం తెంచుకున్నారు.